ఘనంగా జూపల్లి పుట్టినరోజు వేడుకలు



కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణరావు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణరావు

కూకట్‌పల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణరావు జన్మదిన వేడుకలను ఆయన నివాసంలో బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జూపల్లికి కేక్ తినిపించారు. 121 డివిజన్‌కు చెందిన కాలనీసంక్షేమ సంఘం నాయకులు, సాయిబాబానగర్ అధ్యక్షుడు శంకర్, రమేశ్‌తో పాటు కాలనీవాసులు కార్పొరేటర్‌ను సత్కరించారు. మహిళా నాయకురాళ్లు, బీఆర్ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్ తూమువేణు, పీఆర్‌వో రమేశ్ పాల్గొన్నారు.



కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బాలానగర్ నేతలు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్లు ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్‌గౌడ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు ధారం వెంకటేశం గుప్తా, యువ నాయకుడు ధారం సతీష్‌గుప్తా జూపల్లిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

- బాలానగర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి)

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరలోనే అందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని రాందేవ్‌రావు హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డా.కమలాకర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం కూకట్‌పల్లి రాందేవ్‌రావు హాస్పిటల్‌లో ఈఎన్‌టీ, డెర్మటాలజీ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఇతర విభాగాల్లో కూడా ఇలాంటి సేవలు అందిస్తే బాగుంటుందని రోగులు ఆయన దృష్టికి తేగా.. దీంతో త్వరలోనే అన్ని విభాగాల వైద్యులతో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయిస్తానని హామి ఇచ్చారు. ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పదన వచ్చిందని సీఈవో డా.యోబు తెలిపారు. వైద్యలు సూచనల మేరకు సిటీ స్కాన్ రూ.1000, ఎంఆర్ఐ రూ.2000కే చేశామన్నారు.



రోగి చెవిని పరీక్షిస్తున్న వైద్యురాలు

ప్రతిభ కనబరిచిన చిన్నారులకు అవార్డులు



అవార్డులు అందుకున్న చిన్నారులు

హైదర్‌నగర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కూచిపూడి నృత్య కళా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ఆదివారం అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. నగరంలోని బిర్లా భాస్కర్ ఆడిటోరియంలో కళాకర్ తెలుగు టీవీ, శివనంది అవార్డ్స్ 2025 ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆధ్యాత్మిక గురువు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ నృత్య పోటీల్లో హైదరాబాద్‌లోని రుహాని కూచిపూడి అకాడమీ నిర్వాహకురాలు కల్పన ఆధ్వర్యంలో బిందుమాధవి, భావనలతో పాటు పలువురు చిన్నారులు నృత్యప్రదర్శన ఇచ్చారు. ప్రతిభ కనబరిచిన చిన్నారులను దైవజ్ఞశర్మ అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలుగు సంస్కృతి కళలను భావితరాలకు అందించడానికి తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు.

వ్యాపార వేత్తలను తయారు చేయడమే లక్ష్యం



సమ్మిట్‌లో పాల్గొన్న రంగం ఫౌండేషన్ కో చైర్ పర్సన్ ఇందుమతి శ్రీరంగం

బాలానగర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నూతన వ్యాపార వేత్తలను తయారు చేయడమే లక్ష్యంగా శ్రీరంగం ఫౌండేషన్ ముందుకు వెళ్తోందని ఫౌండేషన్ కో ఛైర్ పర్సన్ ఇందుమతి శ్రీరంగం అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో ఆదివారం జరిగిన ఉమెన్ ఇంటర్నేషనల్ సమ్మిట్ ఆన్ ఎంట్రీప్రీనర్‌షిప్, బీటూబీ ఎక్స్‌పో 2025 కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ... శ్రీరంగం ఫౌండేషన్, కాన్ఫిడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రీప్రీనర్స్ మధ్య అవగాహన ఒప్పందం కుదరడం శుభ సూచకమన్నారు. ఈ ఒప్పందం నూతన మహిళ పారిశ్రామిక వేత్తల అభివృద్ధి, వ్యాపార అవకాశాల విస్తరణకు దోహద పడగలదని తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మహిళా సాధికారత, విద్య, ఆరోగ్య సంరక్షణ, సామాజిక అభివృద్ధిలో తమ ఫౌండేషన్ విశేష సేవలు అందిస్తూ, మహిళా వ్యాపార వేత్తలను ప్రోత్సహించడంలో తమ ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందని ఆమె చెప్పారు. ఆమె చేతుల మీదుగా 108మంది మహిళా వ్యాపార వేత్తలకు శక్తి అవార్డులను ప్రధానం చేశారు. 40కి పైగా బయ్యర్లల, 70కి పైగా సెల్లర్లు, మహిళా పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

తగ్గని 'బర్డ్‌ఫ్లూ' భయం

- ధర ఎక్కువైనా మటన్, చేపల కోసం క్యూ
- రెండు వారాలుగా జోరుగా విక్రయాలు





కేపీహెచ్‌బీ 2వ రోడ్డులోని ఓ చేపల దుకాణం వద్ద కొనుగోలుదారులు, కేపీహెచ్‌బీ బీఎస్ఎన్ఎల్ రోడ్డులోని మటన్ దుకాణం ముందు క్యూ

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నాన్ వెజ్ ప్రియు ల్లో బర్డ్‌ఫ్లూ భయం ఇంకా తొలిగిపోలేదు. ఆదివారం కావడంతో కేపీహెచ్‌బీ పరిసర ప్రాంతాల్లోని మటన్ దుకాణాలు, చేపల విక్రయ కేంద్రాల వద్ద కొనుగోలుదారులు క్యూ కట్టారు. బర్డ్ ఫ్లూకు ముందు కేజీ మటన్ రూ. 750-800 ఉండగా.. తాజాగా రూ. 1000-1200 వరకు విక్రయిస్తున్నారు. ఇక సాధారణ చేపలు కేజీ రూ.130-150 ఉండేది కాస్త ఇప్పుడు రూ.250 వరకు విక్రయిస్తున్నారు.

చికెన్ ధరలు కేజీ గతంలో రూ.200కు పైగా అమ్మేవారు కాస్త ప్రస్తుతం రూ. 150-160కు విక్రయిస్తున్నా కొనేవారే లేరు. ప్రజలు ఆరోగ్యం పట్ల ఎంతో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కోళ్లకు బర్డ్ ఫ్లూ వాస్తవమే అయినా ఆ చికెన్ ఉడకబెట్టి తినడం వల్ల ప్రజలకు ఏం కాదని పత్రికలు, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. అయినా చికెన్ తినడం మానేయడం లేదా కాస్త ధర ఎక్కువ అయినా మటన్, చేపలు, రొయ్యలు వంటివి తినేందుకు ఏ మాత్రం వెనకాడడం లేదని కేపీహెచ్‌బీలోని నాన్‌వెజ్ మార్కెట్ నిర్వాహకులు చెబుతున్నారు. రెండు వారాలుగా నాన్ వెజ్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోందని చెబుతున్నారు. ఆదివారం ఉదయం 10 తర్వాత కూడా చేపలు, మటన్ దుకాణాల వద్ద ప్రజలు క్యూలో ఉండి కొనుగోల్లు చేస్తూ కనిపించారు.

ధ్వజస్తంభ ఏర్పాటుకు శంకుస్థాపన

బాలానగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ చరబండరాజూ కాలనీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో నిర్మిస్తున్న సంకష్టహర గణపతి విజయ దుర్గ ధ్వజస్తంభ ఏర్పాటు పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డెపల్లి రాజేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించి ధ్వజస్తంబ ప్రతిష్ఠాపనకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వడ్డెపల్లి మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణ పనులు, స్వామి వారి పూజా కార్యక్రమాల్లో తనను భాగస్వామిడిని చేసినందుకు చరబండరాజూ కాలనీ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌గౌడ్, ప్రదీప్‌రెడ్డి, రాజేంద్రకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు, బస్తీ నాయకులు పాల్గొన్నారు.



సంకష్టహర గణపతి విజయదుర్గ ధ్వజస్తంభ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న రాజేశ్వర్‌రావు

ఎమ్మెల్యేకు రంజాన్ శుభాకాంక్షలు



ముస్లింల అతి పవిత్ర రంజాన్ మాసంలో అందరికీ మంచి జరగాలని కోరుకున్నట్టు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లికి చెందిన పలువురు ముస్లింలు ఎమ్మెల్యేను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. - కూకట్‌పల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి)

ఉపవాసాలు.. ఇఫ్తార్ విందు





రంజాన్ మాసం ప్రారంభం పురస్కరించుకొని కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ పరిసర ప్రాంతాల్లోని ముస్లింలు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ఆదివారం ఉపవాసం ఆరంభించారు. కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-1, నాలుగోఫేజ్‌ల్లోని మసీదుల్లో ప్రార్థనలు చేశారు. సాయంత్రం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

- కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి)

రూ.42 లక్షలతో గార్డెనింగ్ పనులు



వెస్ట్‌జోన్ కార్యాలయం ఆవరణలో గార్డెనింగ్ పనులు

గచ్చిబౌలి,మార్చి2(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ కార్యాలయం ఆవరణలో కొత్తగా రూ.42 లక్షలతో గార్డెనింగ్ పనులు జోరుగా సాగుతున్నాయి. గతంలో ఉన్న గార్డెనింగ్ సరిగా లేకపోవడం వల్ల దానిని తొలగించి కొత్తగా గార్డెనింగ్ చేస్తున్నామని బయోడైవర్సిటీ అధికారులు తెలిపారు. కార్యాలయం ఆవరణలో రకరకాల పూలచెట్లు, లాన్, ఇప్పటికే ఎప్పుగా ఉన్న మొక్కలు తొలగించకుండా వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

గార్డెనింగ్ కోసం నీటి సరఫరా

కార్యాలయం ముందు ఉన్న బోరు బావి అడుగంటుకు పోవడంతో గార్డెన్‌కు నీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. గార్డెనింగ్ నీటి కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని గార్డెనింగ్ మేనేజర్ మాజీద్ వివరించారు. మరో బోరు వేస్తే నీరు పడుతుందో లేదో తెలియదు. గతంలో సమీపంలో ఉన్న గోపిచెరువు నుంచి నీటిని సరఫరా చేసేవాళ్లమని ప్రస్తుతం రోడ్డు పనులతో నీటిసరఫరా కష్టంగా మారిందన్నారు. జోనల్ కార్యాలయం ఆవరణలో గార్డెనింగ్, పచ్చదనంతో కళకళలాడే విధంగా తయారు చేస్తామని ఆయన తెలిపారు.

'ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దు'

పేట్‌బషీరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించవద్దని సీఐ విజయ్‌వర్ధన్ అన్నారు. విజిబుల్ పోలీసుల్లో భాగంగా పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి తనిఖీలను నిర్వహించారు. రెండు బృందాలుగా విడిపోయి తనిఖీలు నిర్వహించి 38 ఓపెన్ కేసులు, ముగ్గురు గంజాయి సేవిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీరోజూ స్టేషన్ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే పనులు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ధర్మేష్, మహేశ్వర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, లావణ్య పాల్గొన్నారు.

నేడు నేషనల్ మిల్లెట్ కిసాన్ మేళా - ఇండస్ట్రీ మీట్

రాజేంద్రనగర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): 2047 నాటికి వికసిత్ భారత్ గా దేశం రూపుదిద్దుకోవాంటే అన్ని రంగాలు అభివృద్ధి చెందాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయాలకనుగుణంగా ఈ నెల 3వ తేదీన నేషనల్ మిల్లెట్ కిసాన్ మేళ-ఇండస్ట్రీ మీట్ నిర్వహిస్తున్నట్లు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ (ఐఐఎంఆర్) డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి తెలిపారు. ఐఐఎంఆర్ గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఆన్ మిల్లెట్స్ సహకారంతో రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో జాతీయ చిరుదాన్యాల కిసాన్ మేళ, ఇండస్ట్రీ మీట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మేళాలో చిరుధాన్యాల ఉత్పత్తుల స్టాళ్లు, ఉత్పత్తిదారులు, కొనుగోలు దారుల సమావేశాలు, ప్యానెల్ డిస్కషన్స్ ఉంటాయన్నారు. మేళాలో వివిధ ప్రాంతాలనుంచి రెండు వేల మంది చిరుధాన్యాలు పండించే రైతులు హాజరవుతారన్నారు. మిల్లెట్ ఫార్మర్స్ ప్రొడ్యుసర్ ఆర్గనైజేషన్‌లు, మహిళ స్వయం సహాయక సంఘాలు, శాస్త్రవేత్తలు, పాలసీ మేకర్స్, వ్యవసాయ రంగ నిపుణులు, చిరుధాన్యాల రంగంలో పనిచేస్తున్న వారు పాల్గొంటారన్నారు. భవిష్యత్ తరాలకు పౌష్టికాహారంతో పాటు అనారోగ్య సమస్యలు లేని జీవితం కావాలంటే చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులతోనే సాధ్యమని ఆమె తెలిపారు. అందుకే ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఒక్కరు చిరుధాన్యాల వైపు చూస్తున్నారన్నారు. చిరుధాన్యాల ఆహార పదార్థాలు వివిధ రకాల వ్యాధులను నయం చేస్తుందన్నారు. చిరుధాన్యాల ఉత్పత్తులతో అనేక రకాల ఆహార ఉత్పత్తులను తయారు చేసే ప్రక్రియ మొదలైందన్నారు.

రాజేంద్రనగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ సెంటర్



గల్లీలో 'గిల్లీ దాండుల్'

- క్రికెట్ ఎంత ఆడినా తగ్గని క్రేజ్

అల్లాపూర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): టెస్ట్ క్రికెట్, ఓడీఐ, ట్వెంటీ - ట్వెంటీ ఇలా ఎన్ని ఫార్మాట్‌లలో క్రికెట్ ఆడినా అన్నిట్లో క్రేజ్ ఉంటుంది. భారత్, పాక్, శ్రీలంక ఇలా దక్షిణాసియా దేశాల్లో క్రికెట్‌కు ఉన్న ఫాలోయింగ్ తక్కువేం కాదు. హైదరాబాద్ ఈ విషయంలో భిన్నం ఏం కాదు. క్రికెట్ మానియా ఎంతలా ఉన్నా దేశీయ ఆట గిల్లీ-దాండుల్‌కు అక్కడక్కడా ఆదరణ కొదవ కాలేదు. ఆదివారం వచ్చిందా స్నేహితులంతా ఖాళీ మైదానాల్లోకి వెళ్లడం, రెండు జట్లుగా మారి ఆట మొదలు పెట్టడం. రూల్ బుక్ అంటూ లేకపోయినా, దశాబ్దాలుగా ఉన్న రూల్స్‌నే ఫాలో అవుతూ యమ సరదాగా ఆడుకుంటారు బస్తీ కుర్రాళ్లు. ఒక్కక్క ఆటగాడు గిల్లీను 50 నుంచి 70 మీటర్లు విసిరి కొడుతూ ఉంటే బ్యాటర్ సిక్సర్ కొట్టినంత ఫాలోయింగ్ ఉంటుందని 'గిల్లీ-దాండుల్' ఆట ఆసక్తి పరులు అంటున్నారు.

పేదవాడి గేం 'గిల్లీ-దాండుల్'

క్రికెట్ ఓ జెంటిల్‌మేన్ గేం, అందులోనూ ఓ ఖరీదైన క్రీడ. విలో వుడ్ బ్యాట్, లెదర్ బాల్ నుంచి మొదలు స్టంప్స్, ప్యాడ్స్, గ్లవ్స్- ఇలా ప్రతీది కాస్ట్‌లీనే. కానీ గిల్లీ-దాండుల్ ఈ విషయంలో పూర్తి భిన్నం, కేవలం మూరెడు కర్ర, జానెడు గిల్లీతో పాటూ ఖాళీ మైదానం ఉంటే చాలు.. కావాల్సింది గేం ఆడాలన్న ఉత్సుకత, 5 నుంచి 10 మంది ఆటగాళ్లు. ఇక క్రికెట్‌లో ఉన్న మజా ఇందులోనూ ఉన్నట్టే.



గిల్లీను పైకి చిమ్మి దాండుల్‌తో కొడుతున్న ఆటగాడు

రెండు స్పోర్ట్స్‌ల్లో సామీప్యత

క్రికెట్‌లో ఒక్క బ్యాటరుకే బంతిని ఆడేందుకు అవకాశం ఉంటుంది. అదే మాదిరిగా దేశీయ క్రీడ 'గిల్లీ-దాండుల్' లేదా 'గిల్లీ-దండా'లోనూ ఒక ఆటగాడు గిల్లీను కర్రతో దూరంగా కొడతాడు. ఇక్కడ బౌలర్, బౌలింగ్ ఉండవు. నేల మీదు ఉన్న రెండు మొనల గిల్లీని దాండుల్‌తో ఒక మెనపై కొట్టి పైకి ఎగచిమ్మి, ఆపైన దాన్ని దూరంగా అదే దాండుల్‌తో విసరగొట్టాలి. బ్యాటర్ కొట్టిన బంతిని ఎలాగైతే ఫీల్డర్ క్యాచ్ పడితే ఔటౌతారో, అలాగే విసరగొట్టిన గిల్లీని పట్టుకునేందుకు ఫీల్డర్లు కాచుకొని ఉంటారు.

ప్రైజ్ మనీ కూడా

జట్లుగా విడిపోయి ఆడి గెలిచిన వారికి బహుమతి లేదా పారితోషికంగా ప్రైజ్‌మనీ కూడా ఉంటుంది. దీన్ని కొందరు బెట్టింగ్ అని పిలుచుకున్నా, కుర్రాళ్లు ఆటను రక్తికట్టించేందుకు కొంత 'బెట్' అనేది ఉంటేనే అందం అంటున్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో కిలో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.13, వంకాయ రూ.18, బెండకాయ రూ.40, పచ్చి మిర్చి రూ.40, బజ్జి మిర్చి రూ.21, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, క్యాబేజీ రూ.10, బీన్స్ రూ.35, క్యారెట్ రూ.19, గోబీ పువ్వు రూ.20, దొండకాయ రూ.45, చిక్కుడు కాయ రూ.45, గోరు చిక్కుడు రూ.45, బీట్‌రూట్ రూ.17, క్యాప్సికం రూ.32, ఆలుగడ్డ రూ.21, కీర రూ.18, దోసకాయ రూ.25, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.18, కంద రూ.65, ఉల్లిపొరక రూ.35, ఉల్లిగడ్డ రూ.36, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.45, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.35, గుమ్మడికాయ రూ.35, నిమ్మకాయలు రూ.50-60, మునగ కాయలు రూ.08-10, పచ్చిబఠాణి రూ.35, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.180, అల్లం రూ.80, వెల్లుల్లి రూ.160, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.75, కరివేపాకు రూ.100, పర్వల్ రూ.60, పల్లికాయ రూ.60, లోబా రూ.25, ఆ కాకరకాయ రూ.60. పైన పేర్కొన్న ధరలు సోమవారం ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు 'ప్రజావాణి'

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంతో పాటు కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహం ఒంటి గంట వరకు ప్రజావాణి ఉంటుంది. జీహెచ్ఎంసీకి సంబంధించిన రోడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు, పారిశుధ్యం, దోమలు, వీధి దీపాలు ఇతరత్రా సమస్యలు ఏమున్నా జడ్సీ, డీసీలకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి సమాధానం కోరవచ్చు. సర్కిళ్ల పరిధిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోతే వాటి గురించి జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయొచ్చు.

నేడు ఓల్డు బోయినపల్లికి ఎమ్మెల్యే కృష్ణారావు

ఓల్డుబోయినపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి సోమవారం ఉదయం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సందర్శించనున్నారు. డివిజన్‌పరిధి అంజయ్యనగర్‌లో సీసీ కెమెరాలను ప్రారంభించిన అనంతరం ఆర్‌ఆర్‌నగర్‌లో ఉన్న హెచ్ఏఎల్ పార్కును సందర్శించి అక్కడి సమస్యలు తెలుసుకుంటారని కార్పొరేటర్ నర్సింహయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

బాలానగర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందాడు. బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధి గురుమూర్తినగర్‌లో శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. యామల లక్ష్మి, యామల బాబురావు(52), దంపతులు. 30 సంవత్సరాలుగా రంగారెడ్డినగర్‌లో నివాసముంటూ మేషన్/ బిల్డింగ్ కాంట్రాక్టు పనులు చేస్తున్నారు. కొంది రోజుల క్రితం గురుమూర్తినగర్‌కు చెందిన ఓ ఇంటి రెండో అంతస్తు నిర్మాణం పనికి ఒప్పుకున్నారు. పనిలో భాగంగా రెండో అంతస్థు స్లాబ్ కోసం ఐరన్ రాడ్డును పైకి చేర వేస్తుండగా ప్రమాద వశాత్తు రాడ్డు విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో బాబురావు విద్యుత్ షాక్‌కు గురై కింద పడ్డాడు. స్పందించి భార్య, ఇంటి యజమాని వెంటనే అతడిని షాపూర్‌నగర్ మెడివిజన్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు చేసిన వైద్యులు అప్పటికే బాబురావ మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు బాలానగర్ పోలీసులు ఇంటి యజమానిపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

హైదర్‌నగర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు శనివారం రాత్రి రూమ్‌లో ఉరివేసుకొని ఆత్యహత్య చేసుకున్నాడు. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన ప్రేమ్‌రావల్(34) ఏడాది నుంచి కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-4లో ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. ప్రేమ్ రావల్ స్థానికంగా ఉన్న హౌస్ కీపింగ్ సంస్థలో పనిచేస్తున్నాడు. ఇతడికి వివాహం కాగా, భార్య నేపాల్‌లోనే ఉంటోంది. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా భార్యభర్తల మధ్య మనస్పర్థలతో ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు బావిస్తున్నారు.

రాయదుర్గంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాయదుర్గం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. పోలీసుల వివరాల ప్రకారం.. మహాప్రస్థానం ఎదురుగా ఉన్న అడవి ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకొని వేలాడుతున్న గుర్తు పట్టలేని స్థితిలో వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, ఆత్మహత్య చేసుకొని ఉంటాడని అంచనాకు వచ్చారు. మృతుడు 35 నుంచి 45సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉంటాడని పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలంలో ఒక బ్యాగు, గ్రీన్ కలర్ షర్టు, వైట్ కలర్ ప్యాంటు, లభించాయి మృతదేహాన్ని ఉస్మానియాకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

పేట్‌బషీరాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ ఎస్ఐ సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపుర సౌత్‌కు చెందిన ప్రశాంత త్రిపుర(23) బతుకుదెరువు కోసం వలసొచ్చి మేడ్చల్ జిల్లా, దేవరాంజల్ గ్రామంలో మల్లన్నకాలనీలో నివాసం ఉంటూ, ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం ప్రశాంత త్రిపురకు ఉదయం బాగా ఎక్కిళ్లు రావడంతో వాళ్ల అన్నయ్య నీళ్లను తాగించేందుకు ప్రయత్నించగా స్పందించకపోవడంతో కండ్లకొయలోని సీఎంఆర్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి పంపించారు. పరీక్షించిన గాంధీ వైద్యులు అప్పటికే మరణించినట్లు తెలిపారు. అన్న పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీనగర్ కాలనీలో గుర్తుతెలియని వ్యక్తి..



పంజాగుట్ట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. శ్రీనగర్ కాలనీ ప్రధాన రహదారిలోని హెచ్‌పీ గ్యాస్ దుకాణం ఎదురుగా గుర్తుతెలియని వ్యక్తి పడిపోయి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా అతడు మృతిచెంది ఉన్నాడు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు 55 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉంటుందని, వివరాలు తెలిసిన వారు 8712661275 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ శోభన్‌కుమార్ కోరారు.

బస్సును ఢీకొట్టిన వ్యాన్.. ఒకరి పరిస్థితి విషమం



ప్రమాదంలో దెబ్బతిన్న వ్యాన్

అమీర్‌పేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ట్రావెల్స్ బస్సును మినీ వ్యాన్ ఢీకొట్టిన ఘటన ఎస్ఆర్‌నగర్‌లో ఆదివారం జరిగింది. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం తెల్లవారుజామున ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన మినీ బస్సు యూటర్న్ తీసుకుంటుండగా ఎర్రగడ్డ వైపు నుంచి వస్తున్న మినీ వ్యాన్ ఢీకొట్టింది. దీంతో బస్సు బోల్తా పడింది. వ్యాన్ ముందు భాగం ధ్వంసం కావడంతో పాటు డ్రైవర్ ఫరీదా షా(24)కు తీవ్ర గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ప్రయాణికులు లేకపోవడం, తెల్లవారుజామున ట్రాఫిక్ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న ఎస్ఆర్‌నగర్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని బస్సును, వ్యాన్‌ను అక్కడి నుంచి తొలగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యాన్ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

'సమస్యలను పరిష్కరించడమే ధ్యేయం'

పేట్‌బషీరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్‌సింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని ఉష్ ఎన్‌క్లేవ్, వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో ఆయన ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో రహదారులు, శానిటేషన్, మురుగు నీటి వ్యవస్థ సరిగా లేదని కాలనీవాసులు ఆయనకు వివరించారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. భిక్షపతి, నర్సింహారెడ్డి, శ్రీహరిరెడ్డి, నాగరాజ్ పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

పేద పిల్లలకు ఉచిత విద్య అభినందనీయం: మంత్రి

గచ్చిబౌలి, మార్చి2(ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని సంస్కృతి విద్యాసంస్థల 15వ వార్షికోత్సవం మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో గత రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ, గత 15ఏళ్లుగా పేద పిల్లలకు ఉచిత విద్యతో పాటు మెరుగైన విద్యను అందిస్తూ ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత పాఠశాల యాజమాన్యానికి దక్కుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు వారి పిల్లలను పాఠశాలల్లో చదివించడం వారికి తగిన విధంగా ఫీజులు వసూలు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కమాండెంట్ రామకృష్ణ

8వ బెటాలియన్ కమాండెంట్‌గా రామకృష్ణ

గచ్చిబౌలి, మార్చి2 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని పోలీస్ బెటాలియన్ నూతన కమాండెంట్‌గా ఎం.రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సన్ని డీఐజీ పదోన్నతిపై ఆ శాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. దీంతో ఇక్కడ ఖాళీ ఏర్పడింది. రామకృష్ణ గతంలో ఇదే శాఖలో ఎస్పీగా పనిచేశారు. ఆయన బదిలీపై 8వ బెటాలియన్ కమాండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు.

దుద్దిళ్ల శ్రీపాదరావుకు నివాళులు

మాజీ మంత్రి, శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 88వ జయంతిని ఆదివారం కొండాపూర్ పోలీస్ బెటాలియన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ రామకృష్ణ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ బీవీ రెడ్డి, సహాయ కమాండెంట్ సీతారాం, నాగభూషణం, పార్థసారథిరెడ్డి, రెహమాన్ పాల్గొన్నారు.



ఏక్ నయీ ముస్కాన్ కార్యక్రమంలో చిన్నారులతో పీవీ సింధు

'ఏక్ నయీ ముస్కాన్'కి మద్దతు: పీవీ.సింధు

రాయదుర్గం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లల్లో వచ్చే పెదవి చీలిక సమస్యను పరిష్కరించేందుకు హిమాలయ వెల్‌నెస్, స్మైల్ ట్రైన్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముస్కాన్ కార్యక్రమం అభినందనీయమని బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, పీవీ.సింధు అన్నారు. ఆదివారం రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీలోని ఐటీసీ కోహినూర్ హోటల్‌లో గ్రహణం మొర్రి చికిత్స పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని చికిత్స పొందిన చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆమె మాట్లాడుతూ, తనకు విజయాలు అంత సునాయాసంగా రాలేదని, ఎంతో కష్టపడ్డానన్నారు. ఏక్ నయీ ముస్కాన్ పేరుతో రెట్టింపు ఉత్సాహంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంస్థకు తన సపోర్టు ఎప్పుడూ ఉంటుందన్నారు. ఇలాంటి కార్యక్రమాల గురించి ప్రజలకు ఎక్కువగా తెలిసేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.



మందకృష్ణ మాదిగను కలిసిన భెల్ ఎస్సీ అసోసియేషన్ ప్రతినిధులు

'మాదిగల హక్కుల సాధన కోసం ఎనలేని పోరాటం'

భెల్‌కాలనీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగను బీహెచ్‌ఈఎల్ తెలంగాణ ఎస్సీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సురేందర్, తెలంగాణ మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్షుడు దేవేందర్‌తో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాదిగల హక్కుల సాధన కోసం ఎనలేని పోరాటం సాగించి, ఎస్సీ వర్గీకరణలో క్రియాశీలక పాత్రపోషించిన మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు దక్కడంపై హర్షం వ్యక్తం చేస్తూ అసోసియేషన్ సభ్యులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. 30 ఏళ్ల ఉద్యమ పోరాటంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, పోరాట ఫలితంగా పద్మశ్రీ అవార్డును అందుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. బీహెచ్‌ఈఎల్‌లో మాదిగ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను మందకృష్ణకు వారు వివరించారు.

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

భెల్‌కాలనీ, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే రంజాన్ వేడుకలు నగరశివారుల్లో ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్, ఎంఐజీకాలనీ, విద్యుత్‌నగర్, ఎల్‌ఐజీ కాలనీలల్లో గల మసీదుల్లో ఆదివారం తెల్లవారు జామున జరిగిన ప్రార్థనలతో రంజాన్ ఉపవాస దీక్షలను ప్రారంభించారు. భెల్ టౌన్‌షిప్‌లో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, మత పెద్ద ఖురాన్‌లోని ముఖ్య సూక్తులను పఠించారు. ఇషానమాజ్ అనంతరం ఆకాశాన నెలవంక దర్శనంతో రంజాన్ ప్రారంభానికి సూచనగా మసీద్‌లలో ఆదివారం తెల్లవారు జామున సైరన్ మోగించారు. దీంతో రంజాన్ ముబారక్ అంటూ పిల్లలు, పెద్దలు శుభాకాంక్షలు తెలపుకుంటూ ఉపవాస దీక్షలకు శ్రీకారం చుట్టారు. రంజాన్ ప్రారంభం కావడంతో నెలరోజుల పాటు నియమ నిష్టలతో దీక్షలను పాటిస్తారు. ఈ సందర్భంగా భెల్ టౌన్‌షిప్, ఎంఐజీ కాలనీ, విద్యుత్‌నగర్ తదితర ప్రాంతాల్లోగల మసీదులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కాగా ఆయా ప్రార్థనా ప్రాంగణాల్లో భెల్ యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సమీప ప్రాంతాల్లో పండ్ల వ్యాపారులు ప్రత్యేక ఆకర్షణతో పండ్లను ఏర్పాటు చేశారు.

పార్కును పరిశీలించిన జనసేన నాయకులు

మియాపూర్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ ఎఫ్‌సీఎల్ కాలనీలోని పార్కును ఆదివారం జనసేన పార్టీ నాయకులు పరిశీలించారు. పార్కులో పిచ్చిమొక్కలు, చెత్తచెదారంతో అపరిశుభ్రంగా మారింది. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ, పార్కులను అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ఆహ్లాదాన్ని నింపే పార్కులు అక్కు, అల్లంతో నిండిపోయిందన్నారు. వెంటనే పార్కును శుభ్రం చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జి

పరిస్థితి చూడరూ..!

పగలు వీధి వ్యాపారాలు.. రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలు



నల్లగండ్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద వీధి వ్యాపారాలు

- మద్యం మత్తులో పాదచారులు.. వాహనదారులపై దాడులు
- సుందరీకరణకు నోచుకోని నల్లగండ్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రాంగణం



భెల్‌కాలనీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నల్లగండ్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి కింది ప్రాంగణమంతా అక్రమ నివాసాలు, పార్కింగ్‌కు నిలయంగా మారింది. నిత్య పాదాచారులు, వాహనదారుల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతం రాత్రి సమయంలో అసాంఘిక కార్యక్రమాలకూ వేదికగా మారింది. దీంతో నిత్యం చిన్నపాటి ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రాంతంపై నిఘా లేకపోవడం, పోలీస్ పెట్రోలింగ్ సక్రమంగా జరగక పోవడంతోనే అడిగేవారు లేక అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ఉదయం బ్రిడ్జి కింద వీధి వ్యాపారాలు, హోటళ్లు నడిపిస్తుండగా రాత్రి సమయాల్లో మందుబాబులకు నిలయంగా మారింది. భిక్షాటన చేసేవారు, వలస జీవులు ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకుని గంజాయి, మద్యం తాగుతూ ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. స్థానికులు భయభ్రాంతులకు గురవుతూ ఈ బ్రిడ్జి వద్దకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, నిఘా లేకపోవడం వల్లే శాంతి భద్రతల విషయంలో వైఫల్యం చెందుతున్నారని ప్రజలు వాపోతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలు అనేది చట్టవిరుద్ధం.. ఇతరులకు ఇబ్బంది కలిగించేది. ఇలాంటిచోట చట్టపరమైన చర్యలు తీసకోవాల్సిన పోలీసులు ఆ దిశగా పనిచేయడంలేదనే వాదన వినిపిస్తోంది. దీంతో ఈ ప్రాంగణం చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. రాత్రి వేళల్లో గంజాయి సేవిస్తూ పాదచారులు, వాహనదారులపై దాడులకు పాల్పడుతున్నారు. సామాజిక నిబంధనలను ఉల్లంఘించడమే కాకుండా ఇతరులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. మరోపక్క ఇక్కడ లారీలు, ట్రక్‌లు అక్రమ పార్కింగ్ చేస్తున్నారు. రాత్రి వేళల్లో మద్యం తాగుతూ పేకాట ఆడుతూ తరచూ గొడవలు పడుతున్నారు.

ఫ్లైఓవర్ కింద సుందరీకరణ పనులు చేపట్టాలి



నగరంలోగల పలు ఫ్లైఓవర్ల కింద జీహెచ్ఎంసీ సుందరీకరణ పనులు చేపట్టి.. పలు బ్రిడ్జీల కింద క్రీడా మైదానాలు, చిన్నపిల్లలకు ఆట వస్తువులను ఏర్పాటు చేసింది. మరికొన్ని ప్రాంతాల్లో వాకింగ్ ట్రాక్‌లు, పచ్చని మొక్కలతో హార్టికల్చర్ ఏర్పాటు చేసింది. కాగా నల్లగండ్లలో గల ఈ ఫ్లైఓవర్‌ను మాత్రం విస్మరించింది. రాత్రివేళల్లో పాదచారులు ఇటు రావాలంటేనే భయపడుతున్నారు. గంజాయి, పేకాటకు అడ్డాగా ఈ ప్రాంతం మారింది.

- జి.మోహన్‌గౌడ్, మాజీ కౌన్సిలర్, ఎంఐజీకాలనీ

ఆక్రమణలు తొలగించాలి



ఫ్లైఓవర్ కింద ప్రాంగణమంతా ఆక్రమణకు గురైంది. ఇందులో చిన్న చిన్న గుడారాలు ఏర్పాటు చేసుకున్న వలసజీవులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. పగలు వ్యాపారాలు నిర్వహిస్తూ రాత్రిళ్లు గంజాయి మత్తులో స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆక్రమణలు తొలగించి నిఘా పటిష్ఠం చేయాలి. రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలి.

- టీపీ. రావు, కార్మిక నాయకుడు, ఎంఐజీకాలనీ

చర్యలు తీసుకున్నాం

నల్లగండ్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని గతంలో ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై చర్యలు తీసుకున్నాం. అక్కడ నివసిస్తున్న వారిని పంపించి వేశాం. ప్రస్తుతం ఎటువంటి సంఘటనలు జరగడం లేదు.

- పాలవెల్లి, సీఐ చందానగర్ పోలీస్ స్టేషన్

గుర్నాథం చెరువు సుందరీకరణ పనుల పరిశీలన

మియాపూర్, మార్చి2(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మురికి కూపాలుగా మారిన చెరువులను సుందర తటాకాలుగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం మియాపూర్ గుర్నాథం చెరువు సుందరీకరణ పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుర్నాథం చెరువు సుందరీకరణ పనులను ప్రభుత్వం, పరిశ్రమల మధ్య భాగస్వామ్యంతో నెక్సస్ సెలక్ట్ మాల్స్ సీఎస్ఆర్ ఫండ్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పనులు చేయడం జరుగుతుందని తెలిపారు. గుర్నాథం చెరువుకు నేటితో దశదిశ మారిందని ఎన్నో ఏళ్ల సమస్య నేటితో తీరుతుందని, శాశ్వత పరిష్కారం దిశగా చెరువును అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. చెరువుకట్టచుట్టు చెట్లు పెంచి చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.



చెరువు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్

మాతృశ్రీనగర్‌లో 5కే రన్

మియాపూర్ మాతృశ్రీనగర్‌లో కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కావూరి అనిల్‌కుమార్, సెక్రటరీ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంఆర్‌డబ్ల్యుఏ 4వ ఎడిషన్ 5కే రన్ కార్యక్రమంలో భారత మాజీ క్రికెటర్, బీసీసీఐ మాజీ చీఫ్ సెక్టార్ ఎంఎస్‌కె ప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొని జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



బాలయోగి స్టేడియంలో 5కే రన్

గచ్చిబౌలి, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వినికిడి దినోత్సవం పురస్కరించుకుని గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో ఆదివారం 5కే రన్ నిర్వహించారు. మౌర్య ఫౌండేషన్ మైక్రోకేర్ ఈఎన్‌టీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రన్‌ను రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రన్ ఫర్ వినికిడి ఆరోగ్యం గురించి అవగాహన కల్పించడానికి వినికిడి లోపం ఉన్న వ్యక్తులకు సహాయం అందిస్తున్న మౌర్య ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమం అమోఘమన్నారు. వినికిడి సమస్యను ముందస్తుగా గుర్తించడం, ప్రోత్సహించడం, ధ్వని అవగాహన కోసం చర్యను ప్రేరేపించడం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కార్యదర్శి అశ్వనీ అమరేశ్వర్ మాట్లాడుతూ, వినికిడి ఆరోగ్యం గురించి ప్రపంచ వ్యాప్తంగా అవగాహన పెంపొందించడం, ఈ సమస్యను ముందస్తుగా గుర్తించడం, ఇలాంటి కార్యక్రమాల ద్వారా పూర్తి మద్దతు ఇవ్వడం ప్రధాన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, ఈఎన్‌టీ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం రన్‌లో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు.



జెండా ఊపి 5కే రన్ ప్రారంభిస్తున్న రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

పెద్దచెరువు ముంపు బాధితుల జేఏసీ పేరుతో వసూళ్లు?

హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదులు

అమీన్‌పూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ పెద్దచెరువు ముంపు బాధితుల జాయింట్ యాక్షన్ కమిటీ పేరుతో ప్లాట్ల యజమానుల నుంచి కొందరు వ్యక్తులు డబ్బులు వసూలు చేస్తున్నారని బాధితులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో గతంలో చేసిన లేఅవుట్లలో సుమారు 20 కాలనీలు, 4వేలకు పైగా ప్లాట్ల యజమానులు ఉన్నారు. వారు సేల్‌డీడ్‌ల ద్వారా 20 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన ప్లాట్లు ప్రస్తుతం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలోకి వస్తున్నాయని ఇంటి నిర్మాణ అనుమతులు జారీ చేయడం లేదు. దీంతో, ఏడాదిగా ప్లాట్ల బాధితులు కొందరు జేఏసీగా ఏర్పడి తమకు న్యాయం చేయాలని ఆందోళనలు చేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఇరిగేషన్ అధికారులను కలుస్తూ తమకు న్యాయం చేయాలని అభ్యర్థిస్తూ పిటిషన్లు ఇస్తున్నారు. జేఏసీ నాయకులు గతంలో హైడ్రా కమిషనర్‌ను సైతం కలిసి పరిస్థితిని వివరించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. బాధితుల అభ్యర్థన మేరకు నిపుణులతో కమిటీని నియమించి పెద్దచెరువు వాస్తవ విస్తీర్ణం గుర్తించేందుకు హైడ్రా చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో కొందరు వ్యక్తులు జేఏసీ పేరుతో ప్లాట్ల యజమానులకు ఫోన్ చేసి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని బాధితులు ఫిర్యాదు చేశారు. రూ.వెయ్యి చెల్లించి జేఏసీ వద్ద నమోదు చేసుకొని రసీదు తీసుకోవాలని, సమస్య పరిష్కారం అయిన తరువాత గజానికి రూ.500 చొప్పున ఇవ్వాల్సి ఉంటుందని చెబుతున్నారని ప్లాట్ల యజమానులు ఫిర్యాదులో పేర్కొనడం గమనార్హం. హైడ్రా కమిషనర్ స్పందిస్తూ ఎవరి వద్ద డబ్బుల వసూళ్లకు పాల్పడినా చర్యలు తీసుకుంటామన్నారు. అభ్యంతరాలుంటే హైడ్రా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ అంశంపై ఇరిగేషన్, జేఎన్‌టీయూ, ఐఐటీ సంస్థల నిపుణులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని కమిషనర్ పేర్కొన్నారు.



వెస్ట్‌జోన్ కార్యాలయం ఆవరణలో గార్డెనింగ్ పనులు

రూ.42 లక్షలతో గార్డెనింగ్ పనులు

గచ్చిబౌలి,మార్చి2(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ కార్యాలయం ఆవరణలో కొత్తగా రూ.42 లక్షలతో గార్డెనింగ్ పనులు జోరుగా సాగుతున్నాయి. గతంలో ఉన్న గార్డెనింగ్ సరిగా లేకపోవడం వల్ల దానిని తొలగించి కొత్తగా గార్డెనింగ్ చేస్తున్నామని బయోడైవర్సిటీ అధికారులు తెలిపారు. కార్యాలయం ఆవరణలో రకరకాల పూలచెట్లు, లాన్, ఇప్పటికే ఎప్పుగా ఉన్న మొక్కలు తొలగించకుండా వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

గార్డెనింగ్ కోసం నీటి సరఫరా

కార్యాలయం ముందు ఉన్న బోరు బావి అడుగంటుకు పోవడంతో గార్డెన్‌కు నీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. గార్డెనింగ్ నీటి కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని గార్డెనింగ్ మేనేజర్ మాజీద్ వివరించారు. మరో బోరు వేస్తే నీరు పడుతుందో లేదో తెలియదు. గతంలో సమీపంలో ఉన్న గోపిచెరువు నుంచి నీటిని సరఫరా చేసేవాళ్లమని ప్రస్తుతం రోడ్డు పనులతో నీటిసరఫరా కష్టంగా మారిందన్నారు. జోనల్ కార్యాలయం ఆవరణలో గార్డెనింగ్, పచ్చదనంతో కళకళలాడే విధంగా తయారు చేస్తామని ఆయన తెలిపారు.

మొక్కల సంరక్షణకు ప్రత్యేక ట్యాంకర్లు

గచ్చిబౌలి,మార్చి2(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వన మహోత్సవంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షిస్తామని వెస్ట్‌జోన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. వెస్ట్‌జోన్ పరిధిలోని శేరిలింగంపల్లి, చందానగర్, పటాన్‌చెరు, యూసఫ్‌గూడ సర్కిల్‌లో 20లక్షల మొక్కలు నాటడం జరిగిందని, ప్రస్తుతం ఎండాకాలంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించే ప్రయత్నం చేస్తున్నామని ఆయన అన్నారు. గతంలో ఇప్పటివరకు రోజువిడిచి రోజు మొక్కలకు నీళ్ల పట్టేవాళ్లమని, మార్చి నుంచి జూలై వరకు నిత్యం నీటిని అందించాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. ప్రతి సర్కిల్‌లో ట్యాంకర్లను అదనంగా ఏర్పాటు చేసి నీటిని అందించే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. నానక్‌రాంగూడ నుంచి ఖాజాగూడ వరకు, ఖాజాగూడ నుంచి దాబా హోటల్ వరకు, తారానగర్ నుంచి నల్లగండ్ల మీదుగా గోపన్‌పల్లి తండా వరకు, తండా నుంచి నానక్‌రాంగూడ వరకు రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్లపై ఉన్న మొక్కలకు నీరు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. పార్కులు, చెరువుగట్లపై, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నాటిన మొక్కలకు నీటిని అందిస్తున్నామన్నారు. శేరిలింగంపల్లి సర్కిల్‌లోనే 12 ట్యాంకర్లు నిరంతరం నీటిని సరఫరా చేస్తున్నాయని తెలిపారు. తమ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారని శ్రీనివాస్ వివరించారు.



గోపన్‌పల్లి, ఖాజాగూడలో ట్యాంకర్ల ద్వారా మొక్కలకు నీరు పోస్తున్న సిబ్బంది

నేపాల్ యువకుడి ఆత్మహత్య

హైదర్‌నగర్, మార్చి2(ఆంధ్రజ్యోతి): బతుకు దెరువు కోసం నగరానికి వచ్చిన నేపాల్‌కు చెందిన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేపీహెచ్‌బీ పోలీసుల వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన ప్రేమ్‌రావల్ (34) ఏడాది నుంచి కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-4లో ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. ప్రేమ్ రావల్ స్థానికంగా ఉన్న హౌస్ కీపింగ్ సంస్థలో పనిచేస్తున్నాడు. ఇతనికి వివాహం కాగా భార్య నేపాల్‌లోనే ఉంటుంది. శనివారం రాత్రి తాను ఉంటున్న రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా భార్యభర్తల మధ్య మనస్పర్థలతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

రాయదుర్గంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాయదుర్గం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. పోలీసుల వివరాల ప్రకారం.. మహాప్రస్థానం ఎదురుగా ఉన్న అడవి ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకొని వేలాడుతున్న గుర్తు పట్టలేని స్థితిలో వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, ఆత్మహత్య చేసుకొని ఉంటాడని అంచనాకు వచ్చారు. మృతుడు 35 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉంటాడని పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలంలో ఒక బ్యాగు, గ్రీన్ కలర్ షర్టు, వైట్ కలర్ ప్యాంటు, లభించాయి మృతదేహాన్ని ఉస్మానియాకి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హెచ్‌సీయూ ఫైనాన్స్ అధికారిగా శ్రీనివాస్

హైదరాబాద్ సిటీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఫైనాన్స్ అధికారిగా బుద్దిడ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఆయన గత 27 ఏళ్లుగా యూనివర్సిటీలోని వివిధ శాఖల్లో ఫైనాన్స్ అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. యూనివర్సిటీతో ఎంతో కాలంగా అనుబంధం ఉన్న ఫైనాన్స్ నిపుణుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వర్సిటీ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని వర్సిటీ వీసీ బీజేరావు అశాభావం వ్యక్తం చేశారు.



ప్రసంగిస్తున్న భెల్ సీనియర్ కార్మిక నాయకుడు టీపీ రావు

బ్రహ్మకుమారీస్ సేవలు అభినందనీయం : టీపీ రావు

భెల్‌కాలనీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతిస్థాపన కోసం బ్రహ్మకుమారీస్ సేవలు అభినందనీయమని భెల్ సీనియర్ కార్మిక నాయకుడు టీపీ రావు అన్నారు. ప్రతీ వ్యక్తి స్వార్థం విడనాడి నిష్కల్మషంగా భగవంతుడిని ప్రార్థిస్తూ, వేదాలపై అవగాహన పెంచుకుంటే జన్మకు సార్థకత చేకూరుతుందని ఆయన సూచించారు. భెల్ ఎంఐజీకాలనీ ఫేస్1 ప్రధాన సెంటర్‌లో ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయలో కార్యాలయాన్ని ప్రారంభించారు. ముందుగా బ్రహ్మకుమారీస్ పతాకాన్ని ఆవిష్కరించి, శాంతిస్థాపన కోసం ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మన భవ్య సంస్కృతికి విరుద్ధంగా పలు బాహ్య, అంతర్గత శక్తులు పనిచేస్తున్నాయన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులకు సన్మానం

చందానగర్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ హుడాకాలనీ సంక్షేమ సంఘం సమావేశం ఆదివారం కమ్యూనిటీ భవనంలో జరిగింది. కాలనీ అభివృద్ధి కోసం అందరూ కలిసి కృషిచేయాలని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కు ఎన్నికల అధికారులు కె.రామకృష్ణ ఎస్.రాజశేఖర్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. అధ్యక్షుడిగా జి.రాజయ్య, ఉపాధ్యక్షుడిగా ఆర్.రమణారెడ్డి, జనరల్ సెక్రటరీగా సిద్ధిరాములు, కోశాధికారిగా రామరాజు కార్యవర్గ సభ్యులుగా జె.రాంరెడ్డి, ఏ.పకీరయ్యలను ఎన్నుకున్నారు. కొత్త, పాత కార్యవర్గం సభ్యులను శాలువలతో సన్మానించారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

మియాపూర్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ దీప్తిశ్రీనగర్‌లో ఆదివారం ఫ్రెండ్స్‌వెల్ఫేర్ అసోసియేషన్, మెడికవర్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక పార్కులో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): మదీనగూడ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జేపీఎన్‌నగర్ మెయిన్‌రోడ్, ప్రశాంత్‌నగర్, డీకే ఎన్‌క్లేవ్‌లో విద్యుత్ ఉండదని వినియోగ దారులు సహకరించాలని కోరారు.

- 11కేవీ వేమనకాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు భవానీపురం, రెడ్డికాలనీ, వీకర్‌సెక్షన్‌కాలనీ, శంకర్‌నగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదు. అదేవిధంగా సురక్షా విద్యుత్ ఫీడర్ పరిధిలో విద్యానగర్, సురక్షాఎన్‌క్లేవ్, రాజేంద్రరెడ్డినగర్, సత్యాఎన్‌క్లేవ్, శుభోదయకాలనీ, అపర్ణ హెచ్‌టీ సర్వీస్‌లో విద్యుత్ ఉండదు. మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు శాంతినగర్ ఫీడర్ పరిధిలో శాంతినగర్, ఉషోదయ అపార్ట్‌మెంట్, ధర్మపురి టెంపుల్‌రోడ్, దీప్తిశ్రీనగర్ రోడ్డునెంబర్ 14-25, ఆదర్శనగర్, సీబీఆర్ ఎస్టేట్స్, క్రోమ్‌బిల్డింగ్ వెనుక ప్రాంతం, శ్రీదుర్గాహోమ్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

ప్రజల పక్షాన ఉన్నవాడే నిజమైన నాయకుడు

నిజాంపేట్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పదవులు ముఖ్యం కాదు. పదవులతో సంబంధం లేకుండా ప్రజల్లో ఉండే నాయకుడే నిజమైన నాయకుడని బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్లోని ఎన్ఎంసీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాజీ బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కో-ఆపరేటర్లు సభ్యులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

సన్మార్గాన్ని చూపాలి

పేట్బషీరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నాటి విలువలను నేటి తరానికి సీనియర్ సిటిజన్స్ తెలియజేయాలని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్లోని వేంకటేశ్వర కాలనీ వెస్ట్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సీనియర్ సిటిజన్స్ మార్గదర్శకులుగా ఉండి, మంచి చెడులను ఈ తరానికి తెలియజేసి, సన్మార్గాన్ని చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో కుంట సిద్దిరాములు, సుధాకర్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సీనియర్ సిటిజన్స్ సభ్యులు సమ్మయ్య, శంకరయ్య, రామచందర్, రాజ్కుమార్, అంజనేయులు, విష్ణు పాల్గొన్నారు.

మరో కార్యక్రమంలో..

వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కొంపల్లి పురపాలకసంఘం పరిధిలోని సిలోం గ్రామర్ స్కూల్లో క్యూరియస్ క్వెస్ట్ ఎక్స్పో సైన్స్ ఫేయిర్ను ఆయన ప్రారంభించారు. పిల్లల్లో ఉన్న సృజనాత్మకతకు సైన్స్ ఫేయిర్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ప్రభాకర్రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కల్యాణ మహోత్సవంలో నాయకులు

దుండిగల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్లోని భ్రమరాంబిక మల్లిఖార్జునస్వామి కల్యాణ, జాతర మహోత్సవంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్లు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆలయాలకు వెళ్లడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు సురేందర్రెడ్డి, శంభీపూర్ కృష్ణ, అనంత స్వామి, విజయ్రామ్రెడ్డి పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న దర్శి భరత్సింహారెడ్డి

సమస్యలను పరిష్కరించడమే ధ్యేయం

పేట్బషీరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్సింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని ఉడ్స్ ఎన్క్లేవ్, వైష్ణవి ఎన్క్లేవ్లో ఆయన ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో రహదారులు, శానిటేషన్, మురుగు నీటి వ్యవస్థ సరిగా లేదని కాలనీవాసులు ఆయనకు వివరించారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి, నర్సింహారెడ్డి, శ్రీహరిరెడ్డి, నాగరాజ్, శివకుమార్, రవీందర్గౌడ్లు తదితరులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు

షాపూర్నగర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అధికారుల అనాలోచిత నిర్ణయాలతో విద్యుత్ సరఫరా జరగక ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. గాజులరామారం సర్కిల్ పరిధిలోని హెచ్ఏఎల్కాలనీలో అప్రకటిత విద్యుత్ కోతతో ఎండ వేడిమి, ఉక్కపోతతో ఇంటిలో ఉండలేక, బయటి ఎండకు తాళలేక ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. విద్యుత్ అధికారులు ముందుగా ఎటువంటి సమాచారం లేకుండానే ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ నిలిపివేస్తుండటంతో ప్రజల అవస్థలు వర్ణానాతీతం. అదేమని అధికారులను నిలదీస్తే సమ్మర్ యాక్షన్ ప్లాన్లో భాగంగా ట్రాన్స్ఫార్మర్లకు మరమ్మతులు చేస్తున్నామని దాటవేస్తున్నారు. ఒకపక్క పైఅధికారులు మాత్రం ఒక్క నిమిషం కోతలేకుండా నిరంతరం విద్యుత్ అందిస్తామని చెపుతున్నా కిందిస్థాయి సిబ్బంది మాత్రం చెప్పిన మాటలు పెడచెవిన పెడుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఒకవేళ మరమ్మతులు నిర్వహించే ముందు ప్రజలకు విద్యుత్కోత ఉంటుందని సమాచారం ఇస్తే బాగుంటుందని, దీంతో ప్రజలు అప్రమత్తమవుతారని స్థానికులు అంటున్నారు.



మండల కార్యాలయం

నల్లా లేని రెవెన్యూ కార్యాలయం

గాజురామారం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ రెవెన్యూ కార్యాలయానికి నీటి కరువు సంభవించింది. కార్యాలయం పక్కనే పలు బస్తీలకు సరఫరా అయ్యే గోదావరి తాగునీటి పైప్లైన్లు కళ్ల ముందు కనపడుతున్నా అధికారులు నల్లా కనెక్షన్ తీసుకోకపోవడంతో కార్యాలయానికి వచ్చేవారు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. ఈ కార్యాలయాన్ని నిర్మించి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా ప్రజలకు సదుపాయాలు కల్పించడంలో నాయకులు, అధికారులు విఫలమవుతున్నారు. ఈ మధ్యకాలంలో వేసిన బోరులో చుక్క నీరు రాక అలంకారప్రాయంగా మారింది. కార్యాలయానికి వచ్చే వారు తాగునీటి కోసం తంటాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అసలే వేసవికాలం.. దూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వచ్చేవారికి దాహం వేస్తే బయటకు వెళ్లి కొనుగోలు చేసి తాగాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యాలయానికి పనుల నిమిత్తం వచ్చిపోయే ప్రజలకు తాగు నీరైనా ఏర్పాటు చేయలేరా? అని అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కార్యాలయానికి నల్లా కనెక్షన్ ఇప్పించి తాగునీటి కష్టాలను తీర్చాలని పలువురు కోరుతున్నారు.

ప్రారంభానికి నోచుకోని ధోబీఘాట్

- నెరవేరని గాజులరామారం రజకుల కల
- కరుణించని అధికారులు

షాపూర్నగర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రజకుల దోబీఘాట్ కల కల్లగానే మిగిలిపోయింది. రజకుల సంక్షేమానికి అప్పటి ప్రభుత్వం గాజులరామారం సర్వే నంబర్ 79/1లో ఎకరా స్థలాన్ని కేటాయించింది. పోరాడి సాధించుకొన్న దోబీ ఘాట్ స్థలంలో హౌజ్లు, విశ్రాంతి గది, చుట్టూ కాంపౌండ్వాల్ నిర్మించారు. బోర్వేసి వదిలేయడంతో నీళ్ళు లేక, అవస్థలు పడుతున్నారు. దాదాపుగా పనులు పూర్తయినా మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని సంఘం వారు ఆరోపిస్తున్నారు. పదేళ్ళుగా మడేలా రజక సేవాసంఘం నేతలు పోరాటం చేస్తున్నా పనులు ముందుకు సాగడంలేదు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సుమారు 100మంది రజక కుటుంబాలు ఈ వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

ఈ దోబీఘాట్కు 1993లో అప్పటి ప్రభుత్వం శివాలయనగర్లో 1.5 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. దీనిని కబ్జాదారులు ఆక్రమించడంతో 2000 సంవత్సరంలో మరోసారి శ్రీరాంనగర్ కొత్తకుంట చెరువు వద్ద స్థలాన్ని కేటాయించారు. అదికూడా వివాదాస్పదంగా మారడంతో 2003 సంవత్సరంలో ఇళ్ళ స్థలాలతో కూడిన స్థలం కేటాయించారు. చివరకు రజక సంఘం నేతల పోరాటం ఫలితంగా 2007లో మూడు ఎకరాల స్థలాన్ని దోబీఘాట్కు కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. కానీ ఈ భూమి టీఎస్ఐఐసీకి చెందినది కావడం, హద్దులు ఏర్పాటు చేయకుండా వదిలివేయడంతో క్రమంగా 2 ఎకరాలు కబ్జాలకు గురైంది. ఒక ఎకరం మిగలడంతో స్థలాన్ని రక్షించేలా బీసీ కార్పొరేషన్ ద్వారా పలు దఫాలుగా రూ.23లక్షలతో హౌజ్లు నిర్మించారు. ఆ తర్వాత రూ.3.75 లక్షలతో రూము, ఇతర సదుపాయాలు కల్పించారు. రూ.38 లక్షలతో చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టారు.

ప్రస్తుతం దోబీఘాట్లో నిర్మించిన హౌజ్లు శిథిలావస్థకు చేరాయి. బోరు బావి, ప్రత్యేక భవనం, విశ్రాంతి గది, తాగునీటి సౌకర్యం తదితర వసతులు కల్పించాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. రజకసంఘం నేతలు ఎమ్మెల్యేను ఆశ్రయించి పలు దఫాలుగా నిధులు మంజూరు చేయించారు. కానీ పనులు ముందుకుసాగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదుపాయాలు కల్పించి అందుబాటులోకి తీసుకొనిరావాలని సంఘ ప్రతినిధులు కోరుతున్నారు.



ధోబీఘాట్లో నిర్మించిన దుస్తులు ఉతికే హౌజ్లు



మోడ్రన్ మిషన్లు



ధోబీఘాట్లో నిర్మించిన గది

కమ్యూనిటీ హాల్ను నిర్మించాలి



రజక వృత్తిని చేసుకొని జీవిస్తున్న వారికి ప్రభుత్వం అండగా నిలవాలి. కాంపౌండ్ వాల్ నిర్మించి గేటు పెట్టినా దొంగల బెడద ఎక్కువగా ఉంది. విద్యుత్ వైర్లు, బోరు సామాన్లు దొంగిలించారు. విశ్రాంతి తీసుకొనేందుకు కమ్యూనిటీ హాల్ను నిర్మించాలని ఎంపీ ఈటల రాజేందర్ను కలిశాం. ఆయన సానుకూలంగా స్పందించారు.

- చంద్రం, సంఘం అధ్యక్షుడు

అండగా నిలవాలి



ఎన్నో ఏళ్ళుగా సుమారు 100 కుటుంబాలకు చెందిన రజకులు తమ జీవనోపాధి కోసం ఆరాటంగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికి దోబీ ఘాట్ కల నెరవేరలేదు. అయినా పట్టువీడక ఎంతోమంది పోరాటం చేస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కేటాయించిన స్థలంలో మౌలిక వసతులు కల్పించి పేదవారి సంక్షేమానికి పనిచేయాలి.

- మణిగొండ శంకర్, సంఘం ప్రధాన కార్యదర్శి

మహాధర్నాతో దద్దరిల్లిన జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్

- బస్డిపో నిర్మించేంత వరకు విశ్రమించం: ఆకుల సతీష్

జీడిమెట్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్టలో బస్ డిపో నిర్మాణం జరిగేంత వరకు విశ్రమించేది లేదని ఆకుల సతీష్ అన్నారు. బస్డిపో నిర్మాణం కోసం ఆదివారం లాస్ట్ బస్టాప్ వద్ద మహాధర్నా కార్యక్రమం చేపట్టారు. పెద్దఎత్తున పాల్గొన్న ప్రజలు స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్పై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

గత పదేళ్లకాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం జగద్గిరిగుట్ట ప్రజలను నిట్టనిలువునా మోసం చేసిందన్నారు. 2017 ఎన్నికల సమయంలో అప్పటి మంత్రి కేటీఆర్, స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్లు పది ఎకరాల హెచ్ఎంటీ స్థలంలో బస్ డిపో నిర్మిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. నూతన బస్ డిపో నిర్మాణం కోసం ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ ప్రాంతంలోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సతీష్ డిమాండ్ చేశారు. అదేవిధంగా బీజేపీ నాయకులు జై శంకర్గౌడ్ మాట్లాడుతూ జగద్గిరిగుట్ట ప్రాంతంలో తక్షణమే బస్సు డిపో నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, అమలేశ్వరి, శ్రీనివాస్గౌడ్, అరుణ్రావు, సుభాష్, లానా, విశాల్, ఫణీంద్ర, సంతోష్, శివగౌడ్, ఈశ్వర్రెడ్డి, మురళి పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న ఆకుల సతీష్, జైశంకర్గౌడ్



పెద్దమ్మతల్లి జాతరలో పాల్గొన్న కొలన్ హన్మంత్రెడ్డి

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా

దుండిగల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : దుండిగల్ మున్సిపల్లో దుండిగల్ గ్రామంలో పెద్దమ్మతల్లి జాతరలో నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కొలన్ హన్మంత్రెడ్డి హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తానని, ప్రజలందరూ తల్లి ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చిన్నంగి వెంకటేష్ ముదిరాజ్, తలారి రాజ్కుమార్, పిట్ల సత్యనారాయణ, అశోక్ పాల్గొన్నారు.



భక్తి శ్రద్ధలతో రంజాన్ను జరుపుకోవాలి

ముస్లీం సోదరులు భక్తి శ్రద్ధలతో రంజాన్ పండుగను జరుపుకోవాలని ఎన్ఎంసీ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్రెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ రాజీవ్ గృహకల్పకు చెందిన ముస్లీం మతపెద్దలు ఆదివారం ఆయనను కార్యాలయంలో కలిశారు. ఈ కార్యక్రమంలో గౌస్, శ్రీనివాసరావు, కుమార్ యాదవ్, శ్రీనివాస్, సుదాకర్, దామోదర్ పాల్గొన్నారు.

- నిజాంపేట్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి)



రాజేంద్రనగర్లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ సెంటర్

నేడు నేషనల్ మిల్లెట్ కిసాన్ మేళా-ఇండస్ట్రీ మీట్

రాజేంద్రనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): 2047 నాటికి వికసిత్ భారత్గా రూపుదిద్దుకోవాలంటే అన్ని రంగాలు అభివృద్ధి చెందాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయాలకనుగుణంగా ఈ నెల 3వ తేదీన నేషనల్ మిల్లెట్ కిసాన్ మేళా-ఇండస్ట్రీ మీట్ నిర్వహిస్తున్నట్లు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్(ఐఐఎంఆర్) డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి తెలిపారు. ఐఐఎంఆర్ గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ సహకారంతో రాజేంద్రనగర్లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో జాతీయ చిరుధాన్యాల కిసాన్ మేళా, ఇండస్ట్రీ మీట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మేళాలో చిరుధాన్యాల ఉత్పత్తుల స్టాళ్లు, ఉత్పత్తిదారులు, కొనుగోలుదారుల సమావేశాలు, ప్యానెల్ డిస్కషన్స్ ఉంటాయన్నారు. మేళాలో వివిధ ప్రాంతాలనుంచి రెండువేల మంది చిరు ధాన్యాలు పండించే రైతులు హాజరవుతారన్నారు. మిల్లెట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లు, మహిళ స్వయం సహాయక సంఘాలు, శాస్త్రవేత్తలు, పాలసీ మేకర్స్, వ్యవసాయ రంగ నిపుణులు, చిరుధాన్యాల రంగంలో పనిచేస్తున్న వారు పాల్గొంటారన్నారు. భవిష్యత్ తరాలకు పౌష్టికాహారంతో పాటు అనారోగ్య సమస్యలు లేని జీవితం కావాలంటే చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులతోనే సాధ్యమని ఆమె తెలిపారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరు చిరుధాన్యాల వైపు చూస్తున్నారన్నారు. చిరుధాన్యాల ఆహార పదార్థాలు వివిధరకాల వ్యాధులను నయం చేస్తుందన్నారు. చిరుధాన్యాల ఉత్పత్తులతో అనేక రకాల ఆహార ఉత్పత్తులను తయారుచేసే ప్రక్రియ మొదలైందన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న సీఐ విజయ్వర్ధన్

ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దు

పేట్బషీరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించవద్దని సీఐ విజయ్వర్ధన్ అన్నారు. విజిబుల్ పోలీసుల్లో భాగంగా పేట్బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి తనిఖీలను నిర్వహించారు. రెండు బృందాలుగా విడిపోయి తనిఖీలు నిర్వహించి 38 ఓపెన్ కేసులు, ముగ్గురు గంజాయి సేవిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీరోజూ స్టేషన్ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే పనులు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ధర్మేష్, మహేశ్వర్రెడ్డి, సురేందర్రెడ్డి, లావణ్య పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త.. నడిచేదెట్లా?

షాపూర్నగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే రహదారిలో స్థానికులు చెత్తవేయడంతో నడవడానికి వీలులేకుండాపోతుంది. పలుమార్లు ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ సిబ్బందికి తెలియజేసినా ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. గాజులరామారం, సూరారం డివిజన్ల మధ్యలో ఉన్న ఈ రోడ్డు శ్మశానానికి పక్కనే ఉండటంతో ఎవరు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడే ప్రభుత్వ పాఠశాల ఉండటంతో చిన్నారులు చెత్తకుప్పల మధ్యనే విద్యనభ్యసించాల్సిన దుస్థితి నెలకొంది. స్థానిక కార్పొరేటర్లు సైతం పట్టించుకోపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, కార్పొరేటర్లు స్పందించి తక్షణమే చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టాలని కోరుతున్నారు.



రహదారిలో పేరుకుపోయిన చెత్త



అమ్మవారిని దర్శించుకొన్న తర్వాత ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న శ్రీశైలంగౌడ్

చిత్తారమ్మతల్లి దీవెనలు ప్రజలపై ఉండాలి

షాపూర్నగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం చిత్తారమ్మదేవిని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఆదివారం దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలపై చిత్తారమ్మతల్లి దీవెనలు ఎల్లప్పుడు మెండుగా ఉండాలన్నారు. అనంతరం నియోజకవర్గ ప్రజలతో వివిధ సమస్యలపై చర్చించారు. సమస్యలను ఇన్చార్జి మంత్రివర్యులు శ్రీధర్బాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, మోతే శ్రీనివాస్, అశోక్, శ్రీనివాస్, వీరలాల్, శ్రీనివాస్రెడ్డి,, అరువ వెంకట్, భూపతిరెడ్డి, సంక్షేమసంఘం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పేట్బషీరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డిబండ సబ్స్టేషన్ పరిధిలో సమ్మర్ యాక్షన్లో భాగంగా సోమవారం విద్యుత్ ఉండదని ఏఈ జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. వైష్ణవి ఎన్క్లేవ్ ఫీడర్లలోని వనమ్స్ స్క్వేర్, కళ్యాణ్ కన్స్ట్రక్షన్స్, వైష్ణవి ఎన్క్లేవ్, హర్ష ఆస్పత్రి, డిమార్టు, జేజిబాబు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంక్షేమ బోర్డులను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

పేట్బషీరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో సుమారు 5వేల కోట్లు ఉన్నాయని, వాటిని భవన కార్మికులకు ఉపయోగిస్తే నెలవారీగా రూ.5 వేల పెన్షన్ ఇవ్వవచ్చునని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసుఫ్ అన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి భవన నిర్మాణ కార్మిక సంఘం 4వ మహాసభలు రంగారెడ్డినగర్ డివిజన్ ఆస్బెస్టాస్ కాలనీ అడ్డా వద్ద ఆదివారం జరిగింది. ఈ మహాసభలకు ఆయన, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రత్నాకర్రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. నిర్మాణ కార్మికులు సుమారు 13 రకాలకు సంబంధించి ప్రభుత్వ సంక్షేమం నుంచి పొందవచ్చునని, నేడు కేంద్రం సంక్షేమ బోర్డులను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతుందన్నారు. భవన నిర్మాణ కార్మికులు సంఘటితమై ఈ నెల 28న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్గౌడ్, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమమహేశ్వర్ , జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు స్వామి, శ్రీనివాస్, నాగప్ప, పరమేశ్వర్, ప్రవీణ్, హరినాథ్, 150 మంది భవన కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూసుఫ్

బస్సును ఢీకొట్టిన వ్యాన్.. ఒకరి పరిస్థితి విషమం

అమీర్పేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ట్రావెల్స్ బస్సును మినీ వ్యాన్ ఢీకొట్టిన ఘటన ఎస్ఆర్నగర్లో ఆదివారం జరిగింది. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఆర్నగర్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం తెల్లవారుజామున ప్రైవేట్ ట్రావెల్స్కు చెందిన మినీ బస్సు యూటర్న్ తీసుకుంటుండగా ఎర్రగడ్డ వైపు నుంచి వస్తున్న మినీ వ్యాన్ ఢీకొట్టింది. దీంతో బస్సు బోల్తా పడింది. వ్యాన్ ముందు భాగం ధ్వంసం కావడంతో పాటు డ్రైవర్ ఫరీదా షా(24)కు తీవ్ర గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్కు స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ప్రయాణికులు లేకపోవడం, తెల్లవారుజామున ట్రాఫిక్ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న ఎస్ఆర్నగర్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని బస్సును, వ్యాన్ను అక్కడి నుంచి తొలగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యాన్ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న వ్యాన్

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

పేట్బషీరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : అనుమానస్పద స్థితిలో యువకుడు మృతి చెందాడు. పేట్బషీరాబాద్ ఎస్ఐ సురేందర్రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం త్రిపుర సౌత్కు చెందిన ప్రశాంత త్రిపుర(23) బతుకుదెరువు కోసం వలస వచ్చి నగర శివారులో మేడ్చల్ జిల్లా, దేవరాంజల్ గ్రామంలో మల్లన్నకాలనీలో నివాసం ఉంటూ, ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం ఉదయం ప్రశాంత త్రిపురకు బాగా ఎక్కిళ్లు రావడంతో వాళ్ల అన్నయ్య నీళ్లను తాగించేందుకు ప్రయత్నించగా స్పందించకపోవడంతో కండ్లకోయలోని సీఎంఆర్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి పంపించారు. పరీక్షించిన గాంధీ వైద్యులు అప్పటికే మరణించినట్లు తెలిపారు. అతడి అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.